సాక్షి
చిత్తూరు
శనివారం। 20। సెప్టెంబర్। 2025



నాణ్యమైన భోజనం అందించండి

హాస్టల్‌లోని విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. - IIలో



పవిత్రం.. పరిసమాప్తం

అప్పలాయిగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. - IIలో



క్రమ'బద్ధకం'

అనుమతిలేని లేఅవుట్లు కొనుగోలు చేసిన వారికి స్థలాల క్రమబద్ధీకరణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. - IIలో

న్యూస్‌రీల్

నేడు ఎస్‌ఎంసీ, క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 20వ తేదీన ఎస్‌ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ), క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాలను పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీగా సమావేశాలను నిర్వహించాలని డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు.

26లోపు మ్యాపింగ్ పూర్తి చేయాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ ఈ నెల 26వ తేదీ లోపు పూర్తి చేయాలని డీఆర్వో మోహన్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఓటర్ల జాబితా ప్రక్రియపై విజయవాడ నుంచి ఎన్నికల సంఘం అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ అనంతరం డీఆర్వో మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియను నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పలువురు అధికారులు పాల్గొన్నారు.

భద్రత మరింత పటిష్టం చేయాలి



సమీక్షలో అధికారులు

కాణిపాకం: ఆలయ భద్రతను మరింత పటిష్టం చేయాలని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, నందకిషోర్ పేర్కొన్నారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం ఆక్టోపస్ మాక్ డ్రిల్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన ఈఓ పెంచలకిషోర్, పోలీసుశాఖ, రెవెన్యూ, అగ్నిమాపక, ఆరోగ్యశాఖల అధికారులతో ఆలయ భద్రతపై చర్చించారు. రాష్ట్ర ఆక్టోపస్ ఆధ్వర్యంలో జరిగే మాక్ ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ తిరుమలయ్య, సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడికి రూ.2.39 కోట్ల ఆదాయం



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి రూ.2,39,09,202 ఆదాయం వచ్చినట్లు ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. వరసిద్ధివినాయకస్వామివారి ఆలయంలో హుండీల లెక్కింపును శుక్రవారం అధికారులు పకడ్బందీగా చేపట్టారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయానికి రూ.2,39,09,202 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. 54 గ్రాముల బంగారం, 1.910 కిలోల వెండి వచ్చిందని చెప్పారు. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.29,485, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.67,339 వచ్చిందన్నారు. 157 యూఎస్‌ఏ డాలర్లు, 12 సింగపూర్ డాలర్లు, 52 మలేషియా రింగిట్స్, 572 యూఏఈ దిర్హామ్స్, 280 కెనడా డాలర్లు, 20 ఆస్ట్రేలియా డాలర్లు, 5 యూరోలు, 15 ఇంగ్లాడ్ పౌండ్స్ వచ్చాయని ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనపాల్, ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికలపై ఉక్కుపిడికిలి

'మెడికల్ కోర్సు చదవాలన్న పేదల కలలపై చంద్రబాబు ఉక్కుపిడికిలి బిగించారు. రాష్ట్రంలో వైద్యవిద్యను విక్రయానికి ఉంచారు. దీంతో పేదలకు వైద్యవిద్య దూరం.. సామాన్యులకు ఉచిత వైద్యం గగనం అవుతుంది. కూటమి సర్కారు దీన్ని వెంటనే ఆపాలి.' అని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నేతలు డిమాండ్ చేశారు.

- విక్రయానికి వైద్యవిద్య
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ యత్నాలు
- చంద్రబాబు రాగానే ప్రైవేటీకరణకు కుట్ర
- ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు జగన్ సర్కారు కృషి
- 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి వైఎస్ జగన్ అడుగులు



ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం నేతలు, పార్టీ ప్రముఖులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సీఎం చంద్రబాబు పేద విద్యార్థుల వైద్యవిద్య కలపై ఉక్కుపిడికిలి బిగిస్తున్నారని, దేశంలోని మెడికల్ కళాశాలల్లో ఎక్కడా పీపీపీ విధానం లేదని, చంద్రబాబు చెబుతున్న నిధుల కొరత కథ అంతా నాటకమేనని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నేతలు ధ్వజమెత్తారు. మదనపల్లె ప్రభుత్వ వైద్యకళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నేతలు పాల్గొని, మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేయలేదని, ఒక మెడికల్ సీటు పెంచలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో రాష్ట్రంలో 2,550 మెడికల్ సీట్లు వస్తుండగా వాటిపై కూటమి నేతల దుష్ప్రచారాలు చేస్తున్నారని



నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



సెల్ఫీ తీసుకుంటున్న భూమన అభినయ్, హర్షిత్‌రెడ్డి

అన్నారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణతో పేద, మధ్య తరగతికి విద్యార్థులు వైద్యవిద్యకు దూరం కావడమే కాకుండా, పేదలకు ఉచిత సేవలు దూరం అవుతాయని ఆవేదన చెందారు. వైద్య కళాశాలల పీపీపీ ప్రక్రియను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

చలో మదనపల్లె మెడికల్ కళాశాల భారీ సక్సెస్

ప్రభుత్వ వైద్యవిద్య పరిరక్షణే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమం భారీ సక్సెస్ అయ్యింది. వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిరసన జ్వాలలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు, విద్యార్థి విభాగం, యువజన విభాగం నేతలు మాట్లాడుతూ అయినవారికి దోచిపెట్టడమే చంద్రబాబు నైజమని మండిపడ్డారు. పేదింటి బిడ్డలకు వైద్యవిద్య భారం కాకూడదని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో అప్పటి సీ ఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 నూతన వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. అందులో భాగంగానే అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రూ.470 కోట్లతో 95 ఎకరాల్లో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారని చెప్పారు. కళాశాల భవన నిర్మాణాలు చాలా వరకూ పూర్తి అయ్యాయని తెలిపారు. కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు ఆగిపోయాయని తెలిపారు. ఏడాదిన్నరగా పనులు సాగలేదని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే రాష్ట్రంలో ఐదు మెడికల్ కళాశాలలను ప్రారంభించారన్నారు. ఆ సమయంలోనే ఎన్నికలు రావడం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందన్నారు. పేదల ఆశలపై నీళ్లు చల్లుతూ సీఎం చంద్రబాబు 'పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్షిప్' (పీపీపీ) విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారని చెప్పారు. రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే చర్యలకు ఉపక్రమించారని తెలిపారు. ప్రైవేట్ చేతుల్లోకి మెడికల్ కళాశాలలు వెళితే పేద విద్యార్థులు ఆ వైద్య కళాశాలల గుమ్మం ఎక్కలేని పరిస్థితి తలెత్తనుండడంతోపాటు వైద్యం ఖరీదవుతుందని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ సీపీ పోరాటాలకు సిద్ధమై, శుక్రవారం యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో మదనపల్లె మెడికల్ కాలేజ్' కార్యక్రమం భారీ సక్సెస్ అయ్యిందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ రెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జ్ నిస్సార్ అహమ్మద్, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, పుంగనూరు నియోజక వర్గ నేతలు శ్రీనాథరెడ్డి, అనూషరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు భూమన అభినయ్ రెడ్డి, విద్యార్థి విభాగం తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, యువజన విభాగం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి, అన్నమయ్య జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్, పార్టీ రాష్ట్ర ప్రచార అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డితోపాటు 17 నియోజకవర్గాల నేతలు పాల్గొన్నారు. అనంతరం మెడికల్ కళాశాల భవనాలను వైఎస్సార్ సీపీ నేతలు పరిశీలించారు.

ప్రధాన భవనం వద్ద బైఠాయింపు

నిర్మాణదశలో ఉన్న ప్రధాన భవనం వద్ద విద్యార్థులు, యువకులతో కలసి వైఎస్సార్ సీపీ నేతలు బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేదల కలలు- ప్రభుత్వ కళాశాలలు, పేదలకు దూరంగా వైద్యం ..బాబు బినామీలకు నైవేద్యం అని నినాదాలు చేశారు.

భవిష్యత్తును కాలరాస్తున్న కూటమి



రాష్ట్ర ప్రజల భవిష్యత్తును కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.8,500 కోట్లతో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టగా ఇంకా రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే పనులు పూర్తవుతాయి. ఈ నిధులు ఖర్చు చేయడం భారమని ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పుకుని ప్రైవేటుకు ఇవ్వాలని ప్రజలను మభ్యపెడుతోంది. దీంతో వేల కోట్లను ఆర్జించాలని చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. కళాశాలలు అందుబాటులోకి వస్తే పేద విద్యార్థులు తక్కువ ఖర్చుతో వైద్య విద్యను అభ్యసించే అవకాశం దక్కుతుంది. మదనపల్లె కళాశాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 99 ఎకరాలను కేటాయించింది. ఇక్కడ భవనాలు నిర్మించారు. కొన్ని పూర్తయ్యే దశలో ఉన్నాయి. ఈ వాస్తవాలను ప్రజలను తెలియాలనే నిరసన కార్యక్రమం చేపట్టాం. చంద్రబాబు చర్యలతో రాష్ట్ర భవిష్యత్తు నాశనం అవుతుంది.

– భూమన అభినయ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

జగనన్న కట్టించిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలి



గత ప్రభుత్వంలో జగనన్న కట్టించిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని చూస్తోంది. పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువచేయాలని జగనన్న సంకల్పిస్తే, తన వర్గానికి అడ్డగోలుగా కాలేజీలను కట్టబెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పిస్తున్నారు. ఇది నిజంగా పేద విద్యార్థులకు చేస్తున్న తీరని ద్రోహం. ప్రయివేటుపరం చేయబోతున్న మెడికల్ కాలేజీల విషయంలో జరుగుతున్న స్కాంను ప్రజల ముందుకు తీసుకువెళతాం.. ఎట్టి పరిస్థితుల్లోను ప్రైవేటు పరం కాకుండా చూడటానికి పోరాడుతాం. ప్రభుత్వం తమ పోరాటాలను లెక్క చేయకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న ఆ టెండర్లను రద్దు చేస్తారని ఇప్పటికే ప్రకటించారు. ఆ మెడికల్ కాలేజీల జోలికి ఎవ్వరు రావద్దని హెచ్చరిస్తున్నా.

– చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు





చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమానికి తరలివస్తున్న జనం

మా భూములు వదిలేయండి సామీ!

రామకుప్పం(కుప్పం): అభివృద్ధి పేరిట తమకు జీవనాధారమైన వ్యవసాయ భూములను లాక్కోవద్దని కోరుతూ రామకుప్పం మండలంలోని రెండు గ్రామాల రైతులు నిరసనకు దిగారు. మండలంలోని మణేంద్రం పంచాయతీ రైతులు శుక్రవారం ఆ గ్రామ సచివాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. ఇప్పటికే విమానాశ్రయం కోసమని రెండు విడతలుగా తమ భూములను లాక్కున్న ప్రభుత్వం పరిశ్రమల పేరుతో మరో సారి భూ సేకరణ చేస్తోందని వాపోయారు. హంద్రీనీవా కాలువలో నీరు వచ్చిన ఆనందం తమకు 15 రోజులు కూడా లేకుండా చేస్తూ మళ్లీ 600 ఎకరాల భూములు లాక్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బంజరు భూములను చదును చేసి, అభివృద్ధి చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. భూములన్నీ కోల్పోతే రైతు, వ్యవసాయ కూలీల కుటుంబాలు వీధిన పడతాయన్నారు. నలభై ఏళ్లుగా సీఎం చంద్రబాబును గుండెల్లో పెట్టుకుని గెలిపిస్తుంటే ఇలా చేయడం తగదన్నారు. రైతుల సాగు భూముల్లో కాక మరో చోట ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు పెట్టాలని కోరారు. సీఎం, జిల్లా కలెక్టర్లు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. మరో వైపు తమ భూముల్లో సోలార్ ప్రాజెక్టు వద్దని బల్ల గ్రామానికి చెందిన బాధిత రైతులు నిరసనకు దిగిన అంశం వెలుగులోకి వచ్చింది. కంపెనీ ప్రతినిధులు జేసీబీలతో భూమి చదునుకు పూనుకోవడంతో రైతులు, వారి కుటుంబ సభ్యులు పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వం తమకు కేటాయించి, సాగు చేసుకుంటున్న భూముల్లో తమకు తెలియకుండానే పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకున్నా బాధితులు జేసీబీలను పని చేయనివ్వలేదు. అధికారులు సాంకేతిక అంశాలను ప్రస్తావించినా రైతులు అంగీకరించలేదు. తాము సాగు చేస్తున్న భూములను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు.



మణేంద్రంలో రోడ్డుపై బైఠాయించిన రైతులు



బల్లలో జేసీబీని అడ్డుకుంటున్న బాధితులు

ఓటర్ల సంక్షిప్త సవరణ పారదర్శకంగా చేపట్టండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని డీఆర్వో మోహన్ కుమార్ ఆదేశించారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిహార్ ఎన్నికల తర్వాత దేశవ్యాప్తంగా ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియను అమలు చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోందన్నారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరణ చేస్తారన్నారు. ఓటరు పుట్టిన ప్రదేశం వివరాలను సేకరిస్తారన్నారు. వయోజనులందరికీ ఓటు కల్పించాలన్నదే భారత ఎన్నికల సంఘం ఉద్దేశమన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ ప్రక్రియ ప్రత్యేక డ్రైవ్ అని అన్నారు. ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా విధులు నిర్వహించాలన్నారు. ఈ కసరత్తులో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఎన్నికల అధికారులకు, బీఎల్వోలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కులశేఖర్, నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు చేశారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య శాస్త్రోక్తంగా అర్చన, అభిషేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి రాహుకాల అభిషేక పూజలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలు, సుగంధభరిత పుష్పాలతో విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

క్లుప్తంగా

మొగిలి ఘాట్‌లో ప్రమాదం.. లారీ డ్రైవర్ మృతి


సూర్యచంద్రరావు మృతదేహం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఎస్‌ఐ కథనం మేరకు.. మంగళూరు నుంచి రాజమహేంద్రవరానికి వెళుతున్న లారీ మార్గం మధ్యలో మొగిలి ఘాట్ వద్ద ముందువెళుతున్న మరో లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా గండేపల్లె మండలం జెడ్.రాగంపేటకు చెందిన లారీ డ్రైవర్ సూర్యచంద్రరావు(51) తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను స్థానికులు, ఇతర వాహనచోదకుల సాయంతో అతికష్టంపై బయటకు తీశారు. చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి


రాజ్‌కమల్ (ఫైల్)

నగరి : మండలంలోని వీకేఆర్ పురం గ్రామం వద్ద నగరి– తిరుత్తణి హైవేపై మోటారు సైకిల్ కల్వర్ట్‌ను ఢీకొనడంతో రాజ్ కమల్ (35) అనే కార్మికుడు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కథనం మేరకు.. నగరి పట్టణం వీకేఎస్ లేఅవుట్ లో కాపురమున్న రాజ్‌కమల్ శుక్రవారం తిరుత్తణిలో మృతి చెందిన బంధువు అంత్యక్రియలకు మోటారు సైకిల్‌పై వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో వీకేఆర్ పురం వద్ద మోటారుసైకిల్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రైవేటు కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్న రాజ్‌కమల్‌కు భార్య, 3వ తరగతి చదివే ఒక కుమార్తె, 4వ తరగతి చదివే ఒక కుమారుడు ఉన్నారు. ఇతని మరణంతో వీకేఎస్ లేఅవుట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

సర్పంచ్‌లకు గౌరవ వేతనం విడుదల

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో సర్పంచ్‌లకు రూ.49,69,138 గౌరవ వేతనం విడుదలైందని డీపీఓ సుధాకర్‌రావు తెలిపారు. ఎన్నికలు జరిగిన 684 పంచాయతీల్లోని సర్పంచ్‌లకు రెండో విడత కింద ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఒక్కొక్క సర్పంచ్‌కు గౌరవ వేతనంగా రూ.3 వేలు వంతున విడుదల కాగా వాటిని బ్యాంకు ఖాతాలకు జమచేయనున్నామని తెలిపారు.

అక్షరమే ఆయుధం

ప్రశ్నించే పత్రికలపై అక్రమ కేసులు



కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, ప్రజావ్యతిరేక కార్యకలాపాలను ప్రశ్నించి ప్రచురించిన పత్రికలపై అక్రమ కేసులు బనాయించడం ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే కక్ష సాధింపు చర్యలకు దిగడం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించినట్లే. వ్యవస్థలను ప్రభుత్వం చేతుల్లోకి తీసుకుని సాక్షి ఎడిటర్, విలేకర్లతో పాటు పలు టీవీ ఛానళ్లపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లే.

– బండి చలపతి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తిరుపతి



ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు



ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పత్రికా రంగంపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల దృష్టి తీసుకొచ్చేది మీడియా మాత్రమే. అలాంటి మీడియాపైన అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు దిగడం దారుణం. సాక్షి ఎడిటర్, పత్రికా విలేకరులపై పెట్టిన కేసులు తక్షణం ఉపసంహరించుకోవాలి. పత్రికా స్వేచ్ఛను హరించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలి.

– భగత్ రవి, ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

క్రమబద్ధకం

- అనుమతిలేని లే-అవుట్లపై అనాసక్తి
- పట్టణాల్లో పర్లేదు.. పల్లెల్లో అవగాహన శూన్యం
- ప్రజలకు వద్దకు వెళ్లి వివరించలేకున్న యంత్రాంగం
- లే-అవుట్ల క్రమబద్ధీకరణకు ఆదరణ కరువు

చిత్తూరు జిల్లాలో పెద్ద ఎత్తున కొత్త లేఅవుట్లు వెలుస్తున్నాయి. సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే వారంతా వీటిలో అవగాహన లేకుండా ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి వాటిని క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అవగాహన లేని ప్లాట్ల యజమానులకు అవగాహన కల్పించి, స్థలాలను క్రమబద్ధీకరించాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా అటు ప్లాట్ల యజమానులకు నష్టం కలుగుతుండగా, ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.


చిత్తూరులో అక్రమ లే-అవుట్లలో రాళ్లను తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: అనుమతి లేకుండా వెలసిన లే-అవుట్లలో స్థలాల క్రమబద్ధీకరణ పథకంపై ప్రజల్లో ఆదరణ కరవు అయ్యింది. ప్రజలకు మేలు చేయాలని తీసుకొచ్చిన లే-అవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)పై అవగాహన కల్పించడంలో యంత్రాంగం స్తబ్దుగా ఉంది. ప్రిన్స్‌పల్ కార్యదర్శి నుంచి మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ వరకు ఎల్‌ఆర్‌ఎస్‌పై చొరవ చూపడంలేదని, వేగం పెంచాలని పదే పదే వీడియో కాన్ఫరెన్సుల్లో ఆదేశిస్తున్నా యంత్రాంగం దానిపై పెద్దగా దృష్టి సారించడంలేదు. పట్టణాల్లో సచివాలయా సిబ్బంది, మున్సిపల్ అధికారులు ఎల్‌ఆర్‌ఎస్‌పై వేగం పెంచితే తప్ప.. ఇది కదిలేలా కనిపించడంలేదు. పల్లెల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు (యూడీఏ) దీనిపై పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేయడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం రావాలంటే అధికారులు అడుగుబయట పెట్టాల్సిందే.

చెబుతున్నారా..?

ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులను సులువుగా తీర్చే అవకాశం ఉంది. ప్రధానంగా పట్టణాల్లో అనుమతి లేని లే-అవుట్లలో అధికారులు ప్లాన్ అప్రూవల్స్ ఇవ్వకపోవడంతో ఇళ్ల కట్టడానికి వీల్లేక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జూన్ 6వ తేదీ వరకు ఎక్కడైతే అనుమతుల్లేకుండా లే-అవుట్లు వేశారో, వాళ్లంతా కూడా ఎల్‌ఆర్‌ఎస్ పరిధిలోకి వస్తారు. ఇదే సమయంలో నిర్ణీత తేదీలోపు సంబంధిత ఎల్‌ఆర్‌ఎస్‌లో ఒక్క ప్లాటయినా విక్రయించి ఉండాలి. దీనికి సంబంధించి రిజిస్టర్ పత్రాలు తప్పనిసరి. ప్రభుత్వం సూచించిన తేదీకన్నా పదేళ్లు, ఇరవై ఏళ్ల క్రితం ఉన్న లే-అవుట్లను సైతం ఈ పథకంలో క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంది. జిల్లాలో చిత్తూరు కార్పొరేషన్‌లో 33, పలమనేరులో 18, పుంగనూరులో 15, కుప్పంలో 6, నగరిలో 12 వరకు అనుమతుల్లేని లే-అవుట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఆయా మున్సిపాలిటీలకు రూ.కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కానీ చాలా చోట్ల అధికారులు దీనిపై సరైన అవగాహన కూడా కల్పించడంలేదు.

రూ.4 కోట్లకు పైగా ఆదాయం

ఓపెన్ ప్రాంతంలో 14 శాతం ఫీజులు చెల్లించి, మార్కెట్ విలువలో 10–30 శాతం వరకు అపరాధ రుసుము చెల్లిస్తే ప్రతి ప్లాటును క్రమబద్ధీకరించుకోవచ్చు. గతనెల 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో పోర్టల్ అందుబాటులోకి వచ్చినా.. దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య వంద కూడా దాటలేదు. జిల్లాలోని కార్పొరేషన్, నాలుగు మున్సిపాలిటీల్లో 1700 వరకు ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాల్సి ఉండగా.. వీటి ద్వారా దాదాపు రూ.4.50 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. సరైన ధ్రువీకరణ పత్రాలను లైసెన్స్‌డ్ ఇంజినీరు, సర్వేయర్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే.. అన్ని సక్రమంగా ఉంటే మూడు రోజుల్లో ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ అనుమతులు మంజూరవుతాయి. అక్టోబర్ నెలాఖరుకు ఈ పథకానికి గడువు ముగియనుంది. కానీ చాలాచోట్ల యంత్రాంగం కాలు కదపడంలేదు.

గ్రామాల్లో దారుణం..

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కాకుండా.. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉపయోగించుకోవచ్చు. చిత్తూరు పరిసరాల్లోని గ్రామాలు చుడా ద్వారా అనుమతులు పొందచ్చు. అలాగే పలమనేరు, కుప్పం, నగరి డివిజన్లలో అక్కడున్న అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ద్వారా ఎల్‌ఆర్‌ఎస్‌లో ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాలి. కానీ చాలా గ్రామాల్లో యూడీఏ అధికారులు కనీస అవగాహన కల్పించడం లేదనే విమర్శలున్నాయి.

చట్టపరంగా ముందుకు...



చిత్తూరులో ఇప్పటికే 30కి పైగా లే-అవుట్లకు అనుమతుల్లేవని గుర్తించాం. వీటి ద్వారా కార్పొరేషన్‌కు రూ.3 కోట్ల వరకు ఆదాయం రావొచ్చు. ఇప్పటికే పత్రికలు, సామాజిక మాధ్యమాలు, హోర్డింగులు, ఆటోల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. అక్రమ లే-అవుట్ల యజమానులకు క్రమబద్ధీకరణకు నోటీసులు కూడా ఇస్తున్నాం. మరికొన్నింట్లో రాళ్లను తొలగించి, రిజిస్ట్రేషన్లపై ఆంక్షలు పెట్టాం. క్రమబద్ధీకరణకు అనుమతులు తీసుకోకుంటే వారిపై చట్టపరంగా ముందుకు వెళతాం.

– నరసింహ ప్రసాద్, కమిషనర్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్

నాణ్యమైన భోజనం అందించండి

పూతలపట్టు(యాదమరి): ప్రభుత్వ హాస్టల్‌లోని విద్యార్థులకు రుచికరమైన నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని పి.కొత్తకోట సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అదనపు గదుల నిర్మాణానికి అవసరమయ్యే నిధులు త్వరలోనే విడుదలయ్యేలా చేస్తానని చెప్పారు. అనంతరం ఎంపీపీ పాఠశాలకు వెళ్లి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. అక్కడి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఈఓ వాసుదేవన్, హెచ్‌ఎం మునిరత్నం, వార్డెన్ జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పంటలపై గజ దాడులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేట, వంకాయల పాటివారిపల్లె, కుమ్మరపల్లె, పాళెం పంచాయతీల్లో శుక్రవారం తెల్లవారు జామున ఏనుగుల గుంపు పంటలపై దాడి చేసి, ధ్వంసం చేశాయి. మిట్టమీదరాచపల్లెలో జగన్‌మోహన్‌రెడ్డి పొలంలో టమాట పంటకు తీవ్ర నష్టం కలిగించాయి. అలాగే మామిడి కొమ్మలను విరిచి వేశాయి. దేవళం పేటలో రోడ్డు దాటి గ్రామంలోకి రావడంతో ప్రజలు భయాందోళన చెందారు. ఎప్పుడు ఎక్కడ దాడి చేస్తాయోనని బిక్కుబిక్కుమంటున్నారు.

పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పీఎం ఎఫ్ఎంఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ(పీఎంఎఫ్ఎంఈ) పథకం స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులకు వరంలాంటిదన్నారు. ఈ పథకం సంఘ సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి దోహదం చేస్తుందన్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖలపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారానికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించి, ఆధునిక సాంకేతికతతో సంఘటిత రంగాల్లో వ్యాపారులుగా నిలబెట్టడమే ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లా టమాట, మామిడి, బెల్లం, జామ తదితర ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతమని చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని చిన్న తరహా పరిశ్రమ ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకు రావాలన్నారు. ఈ పథకం ఆధ్వర్యంలో యూనిట్ వ్యయంలో లబ్ధిదారుల వాటా 10 శాతం పెట్టుబడిగా పెడితే ప్రభుత్వం బ్యాంకు రూపంలో 90 శాతం రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. అలాగే 35 శాతం సబ్సిడీ అందజేస్తుందని తెలిపారు. వ్యాపారానికి సంబంధించి ఆధునిక పద్ధతులు, పరికరాలు వినియోగం, తదితర రంగాల్లో శిక్షణ సైతం ఇస్తారన్నారు. జిల్లాలో ఈ రంగాలపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. హార్టికల్చర్ డీడీ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మధ్య తరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు మంచి అనువైన వాతావరణం ఉందని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని యూనిట్‌లు ఏర్పాటు చేస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. ఇందుకు తమ శాఖ నుంచి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధి మ్యాజ్యూస్, డీపీఎం రవికుమార్, ఏపీఎంలు మధు, సుబ్బారెడ్డి, గోపాల్‌రెడ్డి, హేమ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక




నదుం: చిత్తూరు జిల్లా జూనియర్ బాల, బాలికల కబడ్డీ జట్లను స్థానిక పోలీస్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు ఋమత, కార్యనిర్వాహక కార్యదర్శి రవీంద్రరెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన బాలికలు 46 మంది, బాలురు 78 మంది ఈ పోటీలకు హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో ప్రతిభ చూపిన 12 మందిని ఒక్కో జట్టుకు ఎంపిక చేశామన్నారు. వీరు ఈ నెల 25వ తేదీ నుంచి గొల్లపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీలు భాస్కర్, నౌషాద్, అంజినేయులు, శేఖర్, గుల్జార్, పవిత్ర పాల్గొన్నారు.

నేటమ్స్ షుగర్స్ చైర్మన్ అరెస్టు


నందకుమార్

నింద్ర : నింద్ర నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ నందకుమార్‌ను శుక్రవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. చెరుకు రైతులకు, ఫ్యాక్టరీ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించక ఫ్యాక్టరీ మూసివేసి వెళ్లడంతో అతనిపై వారు నమోదు చేసిన కేసులు నడుస్తున్నాయి. 2019 నుంచి 22 వరకు ఫ్యాక్టరీ నిర్వహణ చేపట్టిన కాలంలో 3,210 మంది రైతులు వారు పండించిన చెరుకును ఫ్యాక్టరీకి తరలించారు. వీరికి రూ. 37 కోట్లు చెల్లించాల్సి ఉంది. అలాగే 310 మంది కార్మికులు ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా వారికి ఏడాది పాటు జీతాలు చెల్లించక ఫ్యాక్టరీ మూసివేయడంతో వారికి చెల్లించాల్సిన వేతనాల బకాయిలు రూ.6 కోట్లు ఉంది. బకాయిలు చెల్లించక 2022 సంవత్సరం ఫ్యాక్టరీని ఆకస్మికంగా మూసివేయడంతో రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించలేదు. దీనిపై చెరుకు రైతు సంఘాలు, కార్మిక యూనియన్‌ల నేతృత్వంలో పలుమార్లు, ఆందోళనలు నిరసనలు, నిరాహార దీక్షలు చేశారు. ఫ్యాక్టరీ కార్మికులు విడివిడిగా యాజమాన్యంపై కేసులు వేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం తిరుపతిలో సౌత్ ఇండియా షుగర్ మిల్ అసోసియేషన్ సమావేశానికి నందకుమార్ విచ్చేశారు. సమాచారం అందుకుని నందకుమార్‌ను అక్క డే అదుపులోకి తీసుకున్నట్లు నగరి రూరల్ సీఐ భాస్క ర్ తెలిపారు. కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

పోలీసునని చెప్పి.. మహిళల వద్ద బంగారం లూటీ

- నిందితుడు అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: పోలీసునని చెప్పి మహిళల వద్ద బంగారం లూటీ చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీసు అతిథిగృహంలో సీఐ మహేశ్వర ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది జూన్‌లో ఓ ప్రేమజంట చిత్తూరు నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఒంటరిగా ఉంది. వారి వద్దకు వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి తాను పోలీసునని చెప్పి పరిచయం చేసుకున్నాడు. 'మీరు ఇక్కడ చేస్తున్న చేష్టలన్నీ డ్రోన్ కెమెరాలో రికార్డు అయ్యాయి. స్టేషన్‌కు పదండి..' అంటూ బెదిరించాడు. స్టేషన్‌కు వెళితే పరువు పోతుందని మహిళ వేడుకోగా, మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని వారిని వదిలేశాడు. గతనెల కూడా ఇదే తరహా ఘటన వేలూరు రోడ్డులో చోటుచేసుకుంది. బాధితులు ఎట్టకేలకు ధైర్యం చేసి, జరిగిన విషయాన్ని మూడు రోజుల క్రితం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడు కొంగారెడ్డిపల్లెకు చెందిన అఖిల్(30)గా గుర్తించారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. 2022లో కూడా నిందితుడిపై ఈ తరహా కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు. పీవీకేఎన్ కళాశాల వెనుక ఉన్న అటవీప్రాంతంలో తిరుగుతున్న అఖిల్‌ను పట్టుకున్న పోలీసులు, అతడి వద్ద ఉన్న 12 గ్రాముల రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా రిమాండ్‌కు ఆదేశించారు. అనంతరం నిందితుడిని చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు. కాగా నిందితుడిపై కేసు నమోదు కావడంతో అతడిని విధుల నుంచి తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. మరోవైపు నిందితుడికి వైఎస్సార్‌సీపీ నేతల ప్రోద్బలంతోనే కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం లభించిందని సీఐ వ్యాఖ్యానించారు. దీనిపై ఆ పార్టీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నేత వద్ద పీఏగా పనిచేసిన నిందితుడు, విధులకు వెళ్లకుండా మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అక్రమంగా వేతనాలు పొందాడని ఆరోపించారు. ఇతను అధికారపార్టీ నేతలకు కొమ్ముకాస్తే, నిందను తమపార్టీపై వేయడం సీఐ అవివేకానికి నిదర్శమమని మండిపడ్డారు.

బర్త్‌డే పార్టీ కోసం వెళ్లి..

నెల్లూరు(క్రైమ్): వారిద్దరూ స్నేహితులు. ఒకేచోట పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో?, మరే ఇతర కారణమో తెలయదు గానీ రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘటనా స్థలంలో ఒకరు చనిపోగా మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన జి.ఉమేష్‌చంద్ర (24), పొదలకూరు మండలం తోడేరు పంచాయతీకి చెందిన పి.వంశీ నెల్లూరు నగరంలోని హరనాథపురంలో ఉన్న ఓ హోటల్లో పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి ఇద్దరూ బర్త్‌డే పార్టీ కోసం హోటల్ యజమాని నుంచి రూ.2 వేలు తీసుకుని బయటకొచ్చారు. ఏం జరిగిందో తెలియదు గానీ గురువారం తెల్లవారుజామున వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఉమేష్‌చంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న వంశీని జీజీహెచ్‌కు తరలించి ఇరు కుటుంబాలకు సమాచారం అందించారు. వంశీ కుటుంబ సభ్యులు నెల్లూరుకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్రోత్సవం.. పరిసమాప్తం


స్వామి అమ్మవార్ల స్నపన తిరుమంజనం

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు శుక్రవారం పవిత్ర విసర్జనతో వైభవంగా పరిసమాప్తమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన చేశారు. అనంతరం ఆలయ పండిత బృందం యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో స్వామి వారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాల నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అడుగడుగునా నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. పవిత్రోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షించారు.



సంధ్యాసమయం.. ముగ్ధమనోహరం.. కనులారా చూసి.. మనసారా ఆస్వాదించే సుమనోహర దృశ్యం. సూర్యాస్తమయం వేళ భానుడి కిరణాలు పల్లె భవనాల హొయలపై పడి పసిడి కాంతులను విరజిమ్ముతున్నాయి. చౌడేపల్లె మండలం ఏ.కొత్తకోట శ్రీ పంచముఖ హనుమద్దీశ్వరస్వామి ఆలయం వద్ద కనువిందు చేసిన దృశ్యమిది. –చౌడేపల్లె

జేశాప్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం


ఎన్నికైన తిరుపతి జిల్లా జేశాప్ కమిటీ, జిల్లా క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోనే ఏకైక జర్నలిస్టు క్రీడా సంఘంగా గుర్తింపు పొందిన జేశాప్ (జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఉమ్మడి తిరుపతి, చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. జేశాప్ రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ నరేష్ ఆదేశాల మేరకు శుక్రవారం తిరుపతి కరకంబాడి రోడ్డులోని సీవీ క్రికెట్ అకాడమీలో జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేశాప్ గత జిల్లా కమిటీ అధ్యక్షుడు పులుగూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు సమక్షంలో పలు తీర్మానాలు చేశారు. ఇందులో భాగంగానే నూతన జిల్లా కమిటీని వారు ప్రకటించారు. జేశాప్ తిరుపతి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా విజయ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నారా హరిబాబు, కోశాధికారిగా భూమిరెడ్డి నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.సుబ్రహ్మణ్యం, దుగ్గాని ప్రసాద్, నెల్లూరు శ్రీనివాసులు, ఉప కార్యదర్శులుగా కామేశ్వరయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, సీనయ్య ఎన్నిక కాగా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నాగార్జున, ప్రతాప్ కుమార్, చిన్నబాబు, మునిశేఖర్, అమర్నాథ్, విజయ్ కుమార్, మునికృష్ణారెడ్డి, భాస్కర్, లోకేష్ రాజు, సతీష్ కుమార్, తులసి రామ్, జగదీష్, మనోహర్ ఎన్నికయ్యారు.

జర్నలిస్టులకు క్రీడలు అవసరం

జర్నలిస్టులకు క్రీడలు ఎంతో అవసరమని, జర్నలిస్టులు రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో రాణించాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాకర్, విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. అక్టోబర్ నెల 5, 6, 7, 8 తేదీల్లో అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో పోటీలు జరగనున్నాయి.